# భక్త కబీర్

- డా. సుదర్శన్ రాజ్, టోరంటో, కెనడా

శ్రీరాములవారి విగ్రహానికి పూజచెయ్యడం రామానందులవారికి దినచర్యలో ముఖ్యభాగం. ఆపూజవట్టి హస్తాలతో పెట్టికిచేసినట్లు కాకుండా ఏకాగ్రతతో చేసేవారు. విగ్రహానికి స్నానపానాదులు చెయ్యడం, అలంకరించడం, దీప ధూప నైవేద్యాలు సమర్పించడం - వాటి మీదే ఆయన ధ్యాస. ఒక రోజు అలంకరణ చేస్తూ తనకి తెలియకుండానే చేసిన తప్పును ఎలాదిద్దుకోవాలా అని తర్జనభర్జన పడుతున్నారు. ఆయన చేసిన తప్పేమిటంటే - విగ్రహం మెడలో పూలమాల వెయ్యకుండా కిరీటం పెట్టేసేరు. పూలమాలవెయ్యడానికి కిరీటం అడ్డు. పెట్టిన కిరీటం తియ్యడం రాములవారిని పరిహాసించినట్లు అవుతుంది. ఏం చేయ్యాలి?

ముతక తెఱకి ఆవలిప్రక్కన కూర్చున్న ఒక శిష్యుడు - "గురువర్యా! మాలకి ముడివిప్పి విగ్రహ కంఠం చుట్టూ పెట్టి ముడి వేయ్యండి." - అని సలహా ఇచ్చేడు. నిజానికి గురువుగారు ఏం చేస్తున్నదీ కనబడదు. ఐనా, రామానందులవారి మనస్సులో ఏం జరుగుతోందో చెప్పేడు. ఆమాటలు వినగానే తనప్రధాన శిష్యులను పిల్చి - "తెర తొలిగించండి. ఈ శిష్యుడి నుంచి నేనేమి దాచగలిగేదేమి లేదు." - అంటూ వెళ్ళి రామానందస్వామి వారు, కులమతబేధాలను పాటించకుండా, హృదయానికి హత్తుకున్నారు ఆ శిష్యుడిని. ఆ శిష్యుడే "కబీర్".

కబీర్ పుట్టుపూర్వోత్తరాలు నిశ్చయంగా తెలియవు. కొందరు "బ్రాహ్మణ వితంతువుకి జన్మించేడని, మరి కొందరు వివాహము కాని స్త్రీకి జన్మించేడని" - కాని ముస్లిం దంపతులకి పసిపాపగా భగీరథీ నదివద్ద 'తమాల్' ప్రాంతంలో దొరకడం, వారి దగ్గర పెరిగేడని - ఇలా రకరకాల వదంతులున్నాయి. ఏది ఏలాగున్నా, చరిత్ర కారులు కబీరు మహమ్మదీయుడని, ఆ తర్వాత వైష్ణవ మతం చేర్చుకుందనీ, క్రీ. శ.1398 లో జన్మించి, 120 సంవత్సరములు బ్రతికి, క్రీ. శ. 1518 లో మరణించేడని నిర్ణయించేరు. మరి కొందరు క్రీ. శ. 1440 లో జన్మించి, క్రీ. శ. 1518 లో తనువు చాలించేడని వ్రాశేరు. ఆ సమయం లోనే భారతదేశం లో భక్తి ఉద్యమము ప్రారంభమైందంటారు.

కబీర్ని పెంచిన ముస్లిం దంపతులు, మొదట్లో వారు హైందవులేట. కాని వారు ముస్లిములుగా మారి నందున వారిని వెలివేసినట్లుగా సంఘం పరిగణించేది. అందువల్ల కబీర్ కి చిన్నతనం నుంచి చదువు, సంధ్యా ఏమిలేవు. మగ్గాలమీద బట్టలు నేస్తూ ఇష్టమొచ్చినట్లు పాటలు పాడుకుంటూ ఉండేదట ఆ కుటుంబం. ఆ అలవాటే వచ్చింది కబీర్కి. చిన్నతనంలోనే స్వామీ రామానంద్ వారి బోధనలంటే అమితంగా ఇష్ట పడేవాడు కబీర్. కాశీకి దగ్గర్లోనే ఉండటంవల్ల, ప్రతిరోజూ ప్రాతఃకాలంలో గంగానదిలో స్నానంచేసి రావడం అలవాటు రామానందులవారికి. ఒక రోజు స్నానం ముగించి తిరిగి వస్తూండగా చీకట్లో ఆయన పాదాలు ఒక మానవ శరీరానికి తగలడం, ఆయన "రామ, రామ" అనడం జరిగింది. వెంటనే కబీర్ నిలబడి "స్వామీ! నాకు మీరు రామ మంత్రం ఉపదేశించేరు. నేను ముస్లిం నేతగాడిని - అయినా మీరే నన్ను శిష్యునిగా స్వీకరించాలి" అని ప్రాధేయపడ్డాడు. ఆ బాలుని శ్రద్ధాభక్తులు, వినయ విధేయతలు చూసి వెనుకాడకుండా వెంటనే కబీర్ని తన శిష్యబృందంలో చేర్చుకున్నారు రామానందులవారు.

కబీర్కి ఏ పని చేస్తున్నా నాలుక మీద భగవన్నామమే ఉండేది. చిన్నతనం లోనే ఆత్మజ్ఞానం **(self-realization)** లభించింది. "భగవంతుడు లేని ప్రదేశం లేదు - కాబట్టి ఎటుచూసినా భగవంతుడు కనిపిస్తాడు" అనేవాడు. మగ్గం మీద బట్టలు నేస్తూనే ఎన్నో పాటలు, పద్యాలు కట్టేడు. తనకి "రామ" అని రెండక్షరాలు వ్రాయడం తప్ప వేరే అక్షర జ్ఞానం లేదు. అందువల్ల అతడు పాడే పాటలు, పద్యాలు చుట్టుపక్కల ఉన్నవారు వింటూ వ్రాసినవే. అతడు ఒకమారు నేతనేస్తూ పాడిన పాట:

"ఆనందం, పరమానందం
నీ నామగీతం నాకు ప్రేమ గీతం
ఆ గీతమే నాచేతికి నేత
నీ దర్శనమే నాకొచ్చిన లాభం."

"సాధువులు, దైవగణంలో చేరిన వారమని చెప్పుకునే డాంబికుల నుద్దేశించి వీళ్ళంతా కాశీ నగర దుండగులు" అని దూషించేవాడు. దేవుడుండేది దేవాలయాల్లోకాదు, మనిషి యొక్క మనసులో అని వక్కాణించేవాడు కబీర్. "అల్లా మసీదు లోనూ, దేవుడు గుళ్ళల్లో రాతివిగ్రహాల్లో మాత్రమే ఉంటే - మఱి తక్కిన ప్రాంతమంతా ఎవరిది? దేవుణ్ణి గుళ్ళల్లోను, మసీదు లోనూ వెదికే బదులు మీ హృదయాలలో వెతుక్కోండి" అనేవాడు కబీర్.

కాశీకి ప్రక్కనున్న పట్టణాన్ని పాలించే సుల్తాను కబీర్ పేరు విని అతడిని చూడాలని వారికి కోరిక కలిగింది. అందువల్ల కాశీకి విచ్చేసి తన భటులతో కబురు పంపించేడు కబీర్కి. ఆ మాట వినగానే "నాకు దేవుడొక్కడే సుల్తాన్. మరెవరూ నాకు సుల్తాన్ కాని, రాజు కాని కాదు" అని, తాను రాడానికి నిరాకరించేడు.

సుల్తాన్ స్వతహాగా క్రూరుడైనా కబీర్ చెప్పిన మాటల్లో కొంత సత్యం లేకపోలేదని గ్రహించి క్షమించ బోయేడు. కాని, సుల్తాన్కి 'కాకా' పట్టే హైందవ పూజారులు, ముస్లిం ముల్లాలు - "మహాప్రభూ! ఈ వ్యక్తి హిందూ, ముస్లిం మతాలను కలుషితం చేస్తున్నాడు, కాబట్టి అతడిని కోర్టుకీడ్చి తగిన శిక్ష విధించాలి" అని మొఱబెట్టారు. వారన్నట్లు గానే కబీర్ను కోర్టుకి తీసికొచ్చేరు.

కోర్టులో కబీర్ నవ్వుతూ "హిందూ, ముస్లిము లలో" ఉన్నది - దైవమొక్కడేనని, - 'రాం, రహీమ్' ఒక్కడేనని, ఆ దేవుడే అందరికి తండ్రి యని నమ్మించడానికి నా జీవితమంతా ప్రయత్నించేను. అయినా నామొఱ ఎవరూ వినలేదు. కాని, నాకు శిక్ష ఇమ్మని ప్రార్థించడంలో మాత్రం ఆ రెండు మతస్తులు ఏకమయ్యేరు - విచిత్రం!" అంటూ వాపోయేడు.

ఆ మాటలు విన్న పెద్దలు కబీర్ ని మతభ్రష్టునిగా నిర్ణయించి, అతడికి సంకెళ్ళు వేసి ముంచి చంపాలని నదిలోకి త్రోసేసేరు. ఆ నదిలో పడగానే విచిత్రంగా సంకెళ్ళన్నీ తెగిపోయి పైకి తేలేడు కబీర్. ఆ వింత చూసి "ఈ కబీర్ మతాలనే కలుషితం చెయ్యడమే కాకుండా, మాంత్రికుడు కూడా" నని నేరారోపణ చేసేరు. "వాడిని ఏనుగు చేత త్రొక్కించండ" న్నారు. కబీర్ ని చూడగానే ఆ ఏనుగు త్రొక్కడానికి బదులు తొండంతో ఎత్తి తన మీద కూర్చోబెట్టుకుంది.

ఈ సంఘటనలను చూస్తూ సుల్తాన్ తో సహా అందరూ ఆశ్చర్య చకితులయ్యారు. కాని అందరి అహం దెబ్బ తింది. "అందరిలో ఉండే దైవమే ఈ ఏనుగులో కూడా ఉన్నా" డన్నాడు. కుట్రపన్నినవాళ్ళందరికీ ఒళ్ళు మండి పోతోంది. ఆ దుగ్ధతో కబీర్ని దగ్ధం చెయ్యాలని మంటలో త్రోసేసేరు. బ్రహ్మాండమైన తేజస్సుతో కబీర్ బయటపడ్డాడు. సుల్తాన్ కబీర్ యొక్క ఘనతను మెచ్చుకుంటూ కళ్ళు వాల్చి "నన్ను క్షమించు, నీ గొప్పదనాన్ని గుర్తించలేక పోయాను" అని ప్రార్థించేడు.

"నీతప్పు కాదు సుల్తాన్. నేనెవరిని నిన్ను క్షమించడానికి? అందర్నీ క్షమించగలవాడు దేవుడొక్కడే", అన్నాడు కబీర్.

ఎవరైనా కాశీలో మరణిస్తే, పునర్జన్మలేదని హిందువులకి నమ్మకం. అందువల్ల అంతిమదశలో చాలామంది కాశీకి వెళ్తారు. కాని జీవితమంతా కాశీలో గడిపి, అక్కడ "పెద్ద మనుషుల" పోరు పడలేక, కబీర్, ఎండిపోయి బీడుపారిన ప్రదేశమైన 'మఘూర్' అనే పల్లెకి భార్యా (లోయ్), పుత్రుడు (కమల్) లతో పయనించేడు. 'దేవుడు హృదయం లో ఉండాలి గాని, కాశీ లోనే ఉన్నాడు, 'మఘూర్' లో లేడను కుంటే ఎలాగ అని 'మఘూర్' లో స్థిరబడ్డాడు. 'మఘూర్' వెళ్ళిన కొద్ది రోజులకే కబీర్ మరణించడం, మరణించిన వెంటనే 'మఘూర్'లో ఎండిపోయిన నది ప్రవహించడం జరిగేయి. బీడుపాటి నపొలాలు సేద్య భూములు గా మారాయి.

కబీర్ మరణించిన తర్వాత అతని దేహాన్ని పాతిపెట్టాలని ముస్లింలు, దహనం చెయ్యాలని హిందువులు పోట్లాడుకుంటూ శవానికి కప్పిన గుడ్డ నిలాగగానే, శరీరం బదులు పూలకుప్ప ఉండడం చూసిఆశ్చర్యపోయి, ఆ పూలకుప్పని సగం సగం పంచుకొని ముస్లింలు వారి భాగాన్ని పాతేరుట, హిందువులు వారి భాగం దహనం చేసేరుట. అటు వంటి మహానుభావుడు కబీర్.

కబీర్ వల్లించిన పద్యాలు, పదాలు, పాటలు, దోహాలు (ద్విపద లు), భజనలు అన్నీ దాదాపు 2000 దాకా ఉన్నాయని అంచనా. ఇవన్నీ చాల మటుకు 'భోజ్ పూరి హిందీ' పద్ధతిలో ఉన్నాయి. సిక్కుల పవిత్ర గ్రంథమైన "గ్రంథ్ సాహిబ్" లో చాలా కబీర్ పాటలున్నాయి. దాదాపు నూరు పాటల దాకా రబీంద్రనాథ్ టాగూర్ ఆంగ్లం లోకి అనువదించినట్లు తెలుస్తోంది. కబీర్ "దోహాలు" విన్న పల్లెప్రజలలో వారి ఆలోచనాశక్తినే మార్చివేసి - ఆ రోజుల్లో ఉత్తమశ్రేణికి చెందిన వారమనుకుని అరాచకంగా వ్యవహరించే పురోహితులనుకూడా ప్రశ్నించగల ధైర్యం వారికి వచ్చిందట. అందుకే కబీర్ అంటే పురోహితులకి వళ్ళు మంట. కబీర్ అనుచరులని "కబీర్ పంథీలు" అంటారు. చాలా మందే ఉన్నారుట.

అదే సమయంలో కాశీ నగరాన్ని "కుంటి తైమూర్" ఆక్రమించి ధ్వంసం చెయ్యడం కూడా జరిగింది. అలాగని ముస్లింలను వెనకేసు కొచ్చాడా అంటే అదీ లేదు."కాబా" వైపు తిరిగి రోజూ ఐదు సార్లు వంగి వంగి 'నమాజ్' చేసే ముస్లింలను తిట్టిపోసేవాడు. అటు హిందువులని, ఇటు ముస్లింలను తిట్టే కబీర్ ఆరెండు మతాల ప్రజలకి వ్యతిరేకి అయ్యాడు. "హిందూ - ముస్లిం" మతాలు కాకుండా తను సృష్టించిన వేరే మతం సిక్కు మతానికి 'నాంది ' ఏమో ననిపిస్తుంది.

తన పాటల్లో ఎన్నో నిగూఢమైన అర్థాలున్నాయి. ఉదాహరణకి - 1. గనుల్లో ఉండే మట్టితో కప్పిన "కెంపు" లకంటె బాగా సానపట్టిన కెంపులకే విలువ ఎక్కువ; అలాగే ముల్లోకాల్లో ఉండే ధనం కంటే హృదయంలో ఉండే మంచే గొప్పధనం. 2. ఉన్నదానితో సంతృప్తి చెందితే తక్కిన ధనమంతా దుమ్ముతో సమానం. 3. దయ ఎక్కడుందో అక్కడే బలమెక్కువ. 4. క్షమ ఎక్కడుందో, అక్కడే దేముడుండేది. 5. ఎవరైతే ప్రాపంచిక పరిస్థితులకి అంటీ అంటనట్లు ఉంటారో, ఎవరైతే నీతి, నిజాయితీలతో మెలుగుతారో, ప్రపంచంలో ఉండే జంతుజాలాలని తమతో సమానంగా పరిగణిస్తారో వారే నిజమైన దైవస్వరూపులు. దేవుడు సదా వారితోనే ఉంటాడు.

ఒక్కటే విచారించవలసిన విషయం. కబీర్ వివాహితుడైనా స్త్రీని నల్ల తాచుతో పోల్చేవాడు. "మానవుని ఆధ్యాత్మిక పురోగతికి స్త్రీయే మహా అడ్డంకు" అనేవాడు. స్త్రీ దగ్గరలో ఉంటే పురుషునికి, ధ్యానం, భక్తి, ముక్తి ఏవి బుఱ్ఱ కెక్కవనేవాడు. పురుషునికి దేవుడికి మధ్యలో అడ్డొచ్చే మాయ 'స్త్రీ' అనేవాడు. స్త్రీజాతి మీద నిరసనభావం తప్పితే తక్కిన విషయాలలో గొప్పవాడనక తప్పదు.

ఆత్మజ్ఞానం పొందినప్పుడు కబీర్ అన్న మాటలు: "నా మనసెప్పుడూ దేవుడిపైనే ఉంటుంది. ఎటు చూసినా, ఎక్కడ చూసినా దేవుడే కనుపిస్తాడు. 'ఈసహజస్థితి' లో నాకు భయమేమిటో తెలియదు. 'సహజ స్థితి' ని గురించి వ్రాసిన కొన్ని పద్యాలు:

సముద్రం, వర్షం లేని చోటు,
ఎండా నీడాలేని చోటు,
సృష్టి - అంతం లేని చోటు,
జనన మరణాలు లేని చోటు,

భయబాధలు లేని చోటు,
మాటల్లో వర్ణించలేను,
అదే సాటి లేని 'సహజ స్థితి '.
దానిని తూచలేను,
అటు బరువు కాదు,
అలాగని తేలిక కాదు,
ఎంత అనుభవించినా తరగదు,
ఊర్ధ్వ-పాతాళ లోకాలు లేవు;
ఉషస్సు లేదు - సంధ్య లేదు,
రాత్రింబవళ్ళు లేవు;
గాలి లేదు, నీరులేదు,
నిప్పు లేదు - అదే సాటి లేని 'సహజస్థితి'.
అందుబాటుండదందరికి,
కాని -
గురుకృప ఉంటే దొరుకుతుంది వారికి.

'సహజస్థితి' లో ఉన్నప్పుడు ఎలా ఉండేది వర్ణించాడు కబీర్. "నేనన్నిటిలో ఉన్నా; అన్నీ నాలో ఉన్నాయి. ప్రకృతిలోని అనేక ఆకారాలు నేనుసృష్టించిన ఆకారాలే. నన్ను 'కబీర్' అని పిలు, లేదా 'రాజారామ్ ' అని పిలు - అన్నీ ఒకటే నాకు. నేను పసిపాపను కాదు, పండుముసలిని కాదు, యవ్వన జ్వాల నన్ను తాకలేదు, నన్నెవ్వరువశం చేసుకోలేరు; నన్నెవరూ ఆజ్ఞాపించలేరు - అదే నా 'సహజ స్థితి '."

కబీర్ పాడిన ద్విపదల్లో కొన్ని మచ్చుతునకలు:

1. "చల్తీ చక్కి దేక్ కర్, దియా కబీ రారోయా,
దుయి పాఠన్ కె బీచ్ మె సచిత్ బచానకోయె."

- "తిరిగే తిరగలి రాళ్ళమధ్య ఏది స్థిరంగా ఉండదని" ఏడ్చేడుట. అంటే - పృథ్వి - ఆకాశం, రాత్రింబగళ్ళు, జనన మరణాలు, సుఖదుఃఖాలనే తిరగలిరాళ్ళ మధ్య జీవితం నలిగిపోతూందని నిగూడార్థం."

2. "బురాజో దేఖా మైచలా, బురా నా మిల్యాకోయె,
జో మన్ ఖోజా అప్నా, తో ముఝ్ సె బురానా కోయె."

- దుర్మార్గులకోసం ఎంతో వెతికేను - ఒక్కడూ దొరకలేదు, నాలోనూ వెతికేను - ఒక్క దుర్మార్గుడు దొరికేడు. సూక్ష్మంగా చెప్పాలంటే "మరొకళ్ళతో తప్పులు పట్టే ముందు నీ తప్పులు నీవు తెల్సుకో.

3. "బడా హువా తో క్యాహువా, జైసే పేడ్ ఖజూర్,
పంథీకో ఛాయా నహీ, ఫల్ లాగే అతి దూర్."

- ఖర్జూరపు చెట్టు గొప్పగా ఎంతో పొడు గెదుగుతుంది, (ఏం లాభం!) అది ఒకళ్ళకి నీడనివ్వదు, దాని పళ్ళు అందనే అందవు. అంటే "నా అంత గొప్ప వాడెవడూ లేడని విఱ్ఱవీగడం అనవసరం - మనం ఎంతమందికి ఉపయోగపడుతున్నామని ఆలోచించాలి. "

4. "జైసే తిల్ మె తేల్ హై, జ్యో చక్ మక్ మె ఆగ్,
తెరా సాయితుఝ్ మే హై, తు జాగ్ సకే తొ జాగ్."

- నూనె గింజలో నూనె దాగినట్లు, చకుముకి రాయిలో నిప్పుదాగి ఉన్నట్లు, దైవం నీలో దాగి ఉన్నాడు - అర్థం చేసుకో.

ఒకసారి ప్రేమికుల గురించి మాట్లాడుతూ అంటాడు:

"ప్రేయసి మనసులో ఉందా? లేక మనసు ప్రేయసిలో ఉందా?" ఎంత చమత్కారమో! ఇన్ని నిగూఢార్థాలుగల కబీర్ 'ద్విపదలు ' చదివి అవగాహన చేసుకోడంలో అనుభవించే ఆనందం అనుభవించి తీరాలి కాని మాటల్లో చెప్పలేము. అన్నీ వ్రాయడానికి ఈ పేజీలు సరిపోవు - నాకూ అంత జ్ఞానమూ లేదు.

******